# పార్కు నిర్వహణ గాలికొదిలేశారు

**అధ్వానంగా కేఎల్ఎన్‌వై పార్కు • రోజుకొకటి మాయమవుతున్న వస్తువులు**

**అమీర్‌పేట:** సనత్‌నగర్ కేఎల్ఎన్‌వై పార్కు నిర్వహణను అధికారులు గాలికొదిలేశారు. అసలు పార్కు ఉన్న సంగతే మరచిపోయినట్లున్నారు. పార్కులోని వస్తువులు దొంగలు మాయం చేస్తున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

- వారం క్రితం రూ.50 వేల విలువచేసే కేబుల్ వైర్ మాయమైంది. స్థానికులు అధికారులకు చెప్పినా కనీసం పోలీసులకు కూడా ఫిర్యాదు చేయలేదు. రెండు రోజుల క్రితం క్రీడా సామగ్రి సైతం ఎత్తుకెళ్లారు. మరుగుదొడ్లలో ఉండే నల్లాలను కూడా ఎత్తుకెళ్లారు. పార్కులో లక్షల రూపాయల విలువ చేసే పనులు చేపడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.
- పార్కులో గతంలో 10 మంది వరకు సెక్యూరిటీ సిబ్బంది ఉండగా నాలుగు నెలల నుండి ఒక్క సెక్యూరిటీ గార్డు కూడా ఉండటం లేదు. ఉదయం పార్కు గేట్లను కూడా తెరిచే పరిస్థితి లేకపోవడంతో ప్రతి రోజూ ఉదయం వాకింగ్ చేసేందుకు వచ్చే వారు గేట్ల తాళాల కోసం వెతకాల్సి వస్తోంది. పైగా సీసీకెమెరాలు మొత్తం పనిచేయడం లేదు.


సనత్‌నగర్ కేఎల్ఎన్‌వై పార్కు

- సెక్యూరిటీ సిబ్బంది లేని కారణంగా ఆకతాయిలు తిష్టవేసి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని సందర్శకులు వాపోయారు.
- చీకటి పడితే చాలు ప్రేమ జంటలు వచ్చి స్థానికులు ఇబ్బంది పడేలా వ్యవహరిస్తున్నారు. ఇక వాహనాలు పార్కింగ్ చేసే ప్రాంతంలో బయటి వ్యక్తులు తమ కార్లను తెచ్చి రోజుల తరబడి ఇక్కడే పార్క్ ఉంచుతున్నారు. ఫలితంగా రోజూ పార్కుకు వచ్చే సందర్శకుల వాహనాలు నిలిపేందుకు స్థలం ఉండటం లేదు. ఉన్నతాధికారులు స్పందించి కేఎల్ఎన్‌వై పార్కు నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం లేకుండా చూడాలని కోరుతున్నారు.

## కూరగాయల ధరలు..

**సనత్‌నగర్:** ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 38, క్యాప్సికమ్ 47, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 13, క్యారెట్ 25, దొండ 35, గుండుబీన్స్ 125, గింజ చిక్కుడు 55, గోకరకాయ 35, కీర 28, దోసకాయ 18, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 25, చామగడ్డ 35, మొరంగడ్డ 15, కందగడ్డ 80, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3-4, ముల్లంగి 5-6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

## వృద్ధాశ్రమంలో మందుల పంపిణీ

**రసూల్‌పురా:** ప్రేమానురాగాల అనుబంధానికి త్యాగానికి ప్రతిక అమ్మ అని.. ఏమి లేకున్నా ఉన్నంతలో సంతోషాన్ని పంచేది అమ్మ అని రాష్ట్ర బెవరేజేస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్ అన్నారు. మాతృదినోత్సవం సందర్భంగా కార్ఖానా లోని ఆర్‌కే. ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో ఉంటున్న మాతృమూర్తులకు ఆదివారం మందులు, నిత్యావసర వస్తువులు, మధ్యాహ్న భోజనం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ రామకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు సతీష్, సత్యనారాయణ,గౌడ్, శ్యాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సైనికులకు మద్దతుగా సంఘీభావ ర్యాలీ..



**సనత్‌నగర్:** పాకిస్థాన్ పీచమణిచేలా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్-2కు మద్దతుగా బేగంపేట మయూరిమార్గ్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు మయూరిమార్గ్ ఆర్‌కే టవర్స్ వద్ద బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి ఈ ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాక్‌కు సరైన బుద్ధి చెప్పేవిధంగా భారత్ త్రివిధ దళాలు కోలుకోలేని దెబ్బకొట్టిందని, ఈ సమయంలో భారత సైన్యానికి యావత్ జాతి మద్దతుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు డీఎల్ఎస్ శాస్త్రి పాల్గొన్నారు.

## జీవై కాంపౌండ్ బస్తీ అధ్యక్షుడిగా వెంకటబాబు


విజయం సాధించిన వెంకటబాబును అభినందిస్తున్న బస్తీ ప్రజలు

**బన్సీలాల్‌పేట్:** బన్సీలాల్‌పేట్ డివిజన్ జీవై కంపౌండ్ బస్తీ ఎన్నికల్లో ఎం. వెంకటబాబు విజయం సాధించారు. ఆదివారం జరిగిన బస్తీ ఎన్నికల్లో అధ్యక్ష పదవికి వెంకటబాబు, కుమార్ యాదవ్‌లు పోటీ చేశారు. వెంకటబాబుకు 80 ఓట్లు రాగా, కుమార్ యాదవ్‌కు 65 ఓట్లు వచ్చాయి. మొత్తం 145 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. విజయం సాధించిన వెంకటబాబును పలువురు సత్కరించి పూలమాలలను అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరి సహకారంతో బస్తీ అభివృద్ధికి పాటు పడుతానని పేర్కొన్నారు.

## ఘనంగా ఉర్సు


ప్రార్థనలో పాల్గొన్న మాజీ మంత్రి మహమూద్ అలీ

**రసూల్‌పురా:** కంటోన్మెంట్‌లో ప్రసిద్ధి చెందిన కార్ఖాన హజ్రత్‌లాల్‌షా మహమూద్ ఖాద్రీ షరీఫ్ దర్గా ఉర్సు ఉత్సవం శనివారం రాత్రి ఘనంగా జరిగింది. హోంశాఖ మాజీ మంత్రి మహమూద్ అలీ, బీఆర్ఎస్ నాయకులు నివేదిత సాయన్న, మార్కెట్ మాజీ చైర్మన్ టిఎన్. శ్రీనివాస్, బోర్డు మాజీ సభ్యులు లోక్‌నాథ్, మైనార్టీ నాయకులు అక్తర్ తదితరులు ఉర్సు ఉత్సవంలో పాల్గొని ఛాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వీరిని ఘనంగా సన్మానించారు.

## సార్వత్రిక సమ్మె వాల్ పోస్టర్ ఆవిష్కరణ

**రహమత్‌నగర్:** దేశ వ్యాప్తంగా ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సిఐటీయూ నగర నాయకుడు రాపర్తి అశోక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సమ్మెను సంబంధించిన వాల్ పోస్టర్‌ను కార్మికులతో కలిసి ఎస్పీఆర్‌హిల్స్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు.

# అమ్మ లేనిదే సృష్టి లేదు : తలసాని

**అమీర్‌పేట:** అమ్మ లేనిదే సృష్టి లేదని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. అంతర్జాతీయ మాతృదినోత్సవం సందర్భంగా ఆదివారం బీకేగూడ పార్కు వద్ద శ్రీనివాస సమాజ సేవా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. త్యాగానికి చిరునామ అమ్మ అని, అమ్మ ప్రేమ వెలకట్టలేనిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎస్.శేషుకుమారి, ట్రస్టు అధ్యక్షులు పార్థసారధి పాల్గొన్నారు.

**సనత్‌నగర్:** శ్రీమాతా సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం మోడల్‌కాలనీ పార్కులో నిర్వహించిన సామూహిక సీమంతాలు కార్యక్రమంలో ఎమ్మెల్యే


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలసాని

పాల్గొన్నారు. హాజరయ్యారు. ఈ సందర్భంగా 35 మందికి సామూహిక సీమంతాలు జరిపించారు. అనంతరం వారికి చీరలు, స్వీట్లు పంపిణీ చేశారు.

## జియోఫిజిక్స్‌లో పీహెచ్‌డీ చేసిన ప్రియాంక



**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూ క్యాంపస్ సైన్స్ కాలేజీ జియోఫిజిక్ విభాగం నుంచి ప్రియాంక పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ సాధించారు. సైన్స్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ ప్రొ.వీరయ్య పర్యవేక్షణలో భౌగోళిక ఎలక్ట్రికల్, జియో కెమికల్ విధానాల అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించినట్లు తెలిపారు.

## గోవులను గోశాలకు తరలింపు

**రాంగోపాల్‌పేట్:** రోడ్లపై తిరుగుతూ ట్రాఫిక్‌కు అవాంతరాలు కలిగిస్తున్న ఆవులను ట్రాఫిక్ పోలీసులు గోశాలకు తరలించారు. ఆదివారం ఉత్తర మండలం ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు ఆధ్వర్యంలో గోపాలపురం పోలీసులు జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆదివారం ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 2 ఆవులను కూకట్‌పల్లిలోని గోశాలకు తరలించారు.

## సమస్యలు పరిష్కరించండి


ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న స్థానికులు

**బొల్లారం:** కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ఆదివారం బొల్లారం జనప్రియ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు. మెయిన్ రోడ్డుపై ఉన్న డ్రైనేజీ లైన్ కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు తెలిపారు.

# నృసింహ స్వామికి ప్రత్యేక పూజలు


శ్రీ లక్ష్మీనర్సింహస్వామి జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని



**పద్మారావునగర్:** బండిమేట్‌లోని శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి దేవాలయంలో శ్రీలక్ష్మి నృసింహస్వామి జయంతి వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. పెద్ద ఎత్తున భక్తులు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల సందడితో దేవాలయం ప్రాంగణం హోరెత్తింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరయ్యారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆకుల హరికృష్ణ, సైకిలాబ్ యాదవ్, నాగులు, సత్యనారాయణ, మహేందర్ పాల్గొన్నారు.

**రాంగోపాల్‌పేట్:** నరసింహ స్వామి జయంతి సందర్భంగా సికింద్రాబాద్ ఆర్పీరోడ్ బాటా ప్రాంతంలోని నరసింహ స్వామి దేవాలయంలో స్వామి వారి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారి జయంతి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

## సీసీ కెమెరాలు అందజేత

**రహమత్‌నగర్:** సాధారణంగా పుట్టిన రోజున కేక్ కట్ కట్టింగ్,అన్నదానం లాంటి కర్యాక్రమాలు జరుపుకోవడం మనం చూస్తుంటాం. కానీ బోరబండ డివిజన్‌కు చెందిన భరత్‌నగర్ బస్తీ అధ్యక్షుడు సయ్యద్ ఖయ్యూం తన పుట్టిన రోజున సీసీ టీవీ కెమెరాలు అందజేసి తన సేవాగుణాన్ని చాటుకున్నారు. శనివారం రాత్రి బోరబండ పోలీసులకు నాలుగు సీసీ కెమెరాలు అందించి సేవాగుణం చాటుకున్నాడు. కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ మాట్లాడుతూ.. సయ్యద్ ఖయ్యూం తీసుకున్న నిర్ణయాన్ని ఇతరులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బోరబండ ఎస్‌హెచ్ఓ సురేందర్, ఎస్సై నాగూల్ మీరా, కాంగ్రెస్ నాయకులు కాసుల మహేష్‌గౌడ్, ఆనంద్, చెట్టి దేవేందర్, బాలరాజ్‌గౌడ్, రవీందర్, మహేందర్ గౌడ్, సమీ, అజయ్, ఇనాయత్ తదితరులు పాల్గొన్నారు.

# 'సమ్మర్' సందడి

**ఆటపాటలతో సందడిగా మారిన గతి ప్రభుత్వ పాఠశాల**

**వెంకటేశ్వరకాలనీ:** వేసవి సెలవుల్లో విద్యార్థులకు తెలియని విషయాలను తెలిసేలా... ఆహ్లాదంగా గడిపి వేసవి సెలవులను మరింత ఆనంద జ్ఞాపకాలుగా మిగిల్చుకునేందుకు ప్రభుత్వం బడుల్లో వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసింది. బంజారాహిల్స్ రోడ్ నం.7లోని గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్ విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంటోంది. సుమారు 80 మంది విద్యార్థులు ఈ సమ్మర్ క్యాంప్‌లో అటు కంప్యూటర్ నేర్చుకోవడంతో పాటు ఇటు ఆటపాటలతో సందడి చేస్తున్నారు. లిటిల్‌స్టార్ హైస్కూల్, గతి హైస్కూల్, సెయింట్ ఆల్ఫాన్సెస్ హైస్కూల్, ప్రాక్టీసింగ్ హైస్కూల్, పంజగుట్ట పడవ స్కూల్ తదితర పాఠశాలలకు చెందిన విద్యార్థులు, స్థానికులు ఈ సమ్మర్ క్యాంప్‌లో పాల్గొంటున్నారు.

**ఈనెల 15వ తేదీ వరకు సమ్మర్ క్యాంపు..**

- ఈ సమ్మర్ క్యాంప్ ఉదయం 8నుంచి 11గంటల వరకు ఉంటుందన్నారు. ఈ క్యాంపు ఈనెల 15వ తేదీ వరకు నిర్వహించనున్నారు. కంప్యూటర్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, యోగా, మెడిటేషన్, ఇంగ్లిష్, సైన్స్‌లో శిక్షణ ఇస్తున్నారు. గణితం ట్రిక్స్ ఇందులో నేర్పిస్తున్నారు. కబడ్డీ, ఖోఖో ఆటల్లో కూడా తర్ఫీదు ఇస్తున్నారు. ఇదే పాఠశాలకు చెందిన ఇంగ్లిష్ టీచర్ ప్రసాద్‌బాబు ఈ సమ్మర్ క్యాంప్ కో-ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. టీచ్ ఫర్ చేంజ్ అనే స్వచ్ఛంద సంస్థ కూడా శిక్షణ పొందిన ఉపాధ్యాయులను ఈ సమ్మర్ క్యాంప్‌లో పాల్గొనేలా చేసి విద్యార్థులకు వివిధ అంశాల్లో మెలకువలు నేర్పిస్తున్నారు. సమ్మర్ క్యాంప్ తమకెంతగానో ఉపయోగపడుతుందన్నారు. వచ్చే నెలా 10వ తేదీ వరకు పొడిగిస్తే బాగుంటుందని విద్యార్థులు కోరుతున్నారు.





# బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

**బొల్లారం:** కంటోన్మెంట్ నియోజకవర్గంలోని బొల్లారం వార్డు-8 పరిధిలో రిసాల బజార్ వాటర్ ట్యాంక్ నుండి కమ్యూనిటీ హాల్ వరకు చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శ్రీ గణేష్, మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్, బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద మల్లికార్జున్ భూమిపూజ చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధిలో రహదారుల నిర్మాణానికి ప్రధాన ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ, కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డా. నరసింహన్ కన్నన్, వేణు


సీసీ రోడ్డు నిర్మాణపనులు ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల, ఎమ్మెల్యే శ్రీ గణేష్

గోపాల్ రెడ్డి, బల్వంత్ రెడ్డి, ఖదీర్వన్, బాలరాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

# సైన్యానికి బీజేపీ నేతల సంఘీభావం


సైన్యానికి సంఘీభావం తెలియజేస్తున్న మర్రి పురురవరెడ్డి తదితరులు

**సనత్‌నగర్:** దేశ సరిహద్దుల్లో వీరోచితంగా పోరాడుతున్న భారత సైనికులకు ఎలాంటి ఆటంకాలు కలగకూడదని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం బేగంపేట శ్రీకట్టమైసమ్మ మహాలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర యువనేత మర్రి పురురవరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రతికూల వాతావరణంలో సైతం దేశం కోసం పోరాడుతున్న భారత సైన్యానికి ఆరోగ్యం ప్రసాదించి విజయం చేకూర్చాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం దేవాలయం బయట భారత సైన్యానికి మద్దతుగా ప్లకార్డులు చేతబూని సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో సీనియర్ నేత నెమలి ఆనంద్, ఆలయ ఫౌండర్ ట్రస్టీ చెక్కల సుభాష్‌ముదిరాజ్, వెంకటేష్‌యాదవ్, మధుసూదన్, పవన్‌పాఠక సంధ్యాలక్ష్మీ, మధుసూదన్‌రావు, నాగేష్, పాండియన్ తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా డ్రైవింగ్‌లో శిక్షణ

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూ నిబంధనలకు విరుద్ధంగా క్యాంపస్‌లో కొందరు బయటి వ్యక్తులు కార్ డ్రైవింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నారు. అయితే సెక్యూరిటీ సిబ్బంది మాత్రం పట్టించుకోవడం లేదు. క్యాంపస్‌లో నిబంధనలకు విరుద్ధంగా బయటి వ్యక్తులు కారుతో పాటు ఇతర వాహనాల డ్రైవింగ్‌లో శిక్షణ, పెంపుడు కుక్కలతో తిరగడం, ఆవులు, గేదలు మొక్కలను పాడుచేయడం, వీడియో షూటింగులతో రీల్స్ చేయడం, జంతువులను బలి ఇవ్వడం తదితర కార్యక్రమాలు సెక్యూరిటీ సిబ్బంది ఎదుటే చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఆదివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట బయటి వ్యక్తులు సెక్యూరిటీ సిబ్బంది ముందే కారు డ్రైవింగ్ చేస్తున్నా ఎలాంటి చర్యలు


ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట కారు డ్రైవింగ్

తీసుకోలేదు. ఏటా కోటి రూపాయాలు తీసుకుంటున్న ప్రైవేటు సెక్యూరిటీ యాజమాన్యం వర్సిటీ భద్రతను పట్టించుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్‌ఓసీ పత్రాలు అందచేత

**సికింద్రాబాద్:** ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను, లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఓసీ) పత్రాలను ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ బాధితుల కుటుంబసభ్యులకు అందచేశారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 20 మందికి రూ.7 లక్షల విలువ చేసే చెక్కులు, మరో ఏడుగురికి రూ. 9.90 లక్షల విలువ చేసే లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఓసీ) పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సేవలకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, లింగాని ప్రసన్న లక్ష్మీ శ్రీనివాస్, కంది శైలజ, రాసూరి సునీత, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

# పర్యావరణాన్ని కాపాడటమే మన లక్ష్యం

**ప్రపంచ పర్యావరణ సంస్థను అభినందించిన పుదుచ్చేరి సీఎం**

**హిమాయత్‌నగర్:** పర్యావరణాన్ని కాపాడటమే మన లక్ష్యమని... పర్యావరణ జీవజాతి సంరక్షణ కోసం ప్రపంచ పర్యావరణ సంస్థ చేస్తున్న కార్యక్రమాలను పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగస్వామి అభినందించారని ప్రపంచ పర్యావరణ సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్.భద్ర తెలిపారు. ఇటీవల పుదుచ్చేరిలో పర్యావరణం అంశంపై సీఎంను వారి నివాసంలో కలిసి పర్యావరణంపై చర్చించామని తెలిపారు. భవిష్యత్‌లో పుదుచ్చేరి కేంద్రపాలిత రాష్ట్రాన్ని పర్యావరణ పరిరక్షణకు అనుకూలమైన ప్రదేశంగా తీర్చిదిద్దుతామని సీఎం తెలిపారని చెప్పారు. పర్యావరణ పరిరక్షణపై ప్రపంచంలో ఏ సంస్థ చేయలేని విధంగా లక్షలాది మొక్కలు నాటుతూ వేలాది కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.

# నిమిషం ఆలస్యమైనా అనుమతించం

**13న పాలిసెట్-2025 ప్రవేశ పరీక్ష**

- గంట ముందే పరీక్షా కేంద్రంలోకి..
- పరీక్షా కేంద్రాలకు గుర్తింపు కోసం ప్రత్యేక యాప్ రూపకల్పన
- గచ్చిబౌలి పరిధిలో అయిదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు
- పాలిసెట్-2025 శేరిలింగంపల్లి నోడల్ ఆఫీసర్ షేక్ ఎక్బాల్ హుస్సేన్ వెల్లడి

**రాయదుర్గం:** పాలిసెట్-2025 ప్రవేశ పరీక్షకు ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించమని పాలిసెట్-2025 శేరిలింగంపల్లి నోడల్ ఆఫీసర్, రాయదుర్గం జీఐఎల్‌టీ ప్రిన్సిపాల్ షేక్ ఎక్బాల్ హుస్సేన్ స్పష్టం చేశారు. ప్రవేశ పరీక్ష కేంద్రంలో గంట ముందే విద్యార్థులను అనుమతిస్తామని వివరించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో మంచినీటి వసతి సౌకర్యం, వైద్య కేంద్రం ఏర్పాటు చేసేలా చూశామని, పరీక్ష నిర్వహించే రోజు ఆయా రూట్లలో ప్రత్యేక బస్సులు కూడా అందుబాటులో ఉంటాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

**పాలిసెట్-2025 ప్రవేశ పరీక్ష ఎప్పుడు నిర్వహిస్తారు?**

పాలిసెట్-2025 ప్రవేశ పరీక్షను మే 13న మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. జీఐఎల్‌టీ రాయదుర్గం పరిధిలో ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా అన్ని ఏర్పాట్లు చేశాం.

**పాలిసెట్-2025కు శేరిలింగంపల్లి పరిధిలో ఎన్ని పరీక్షా కేంద్రాలు ఉన్నాయి.?**

పాలిసెట్-25కు శేరిలింగంపల్లి పరిధిలో అయిదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశాం. అందులో మొత్తం 1,133 మంది విద్యార్థులు పరీక్ష రాస్తారు. అందులో రాయదుర్గంలోని జీఐఎల్‌టీలో 125 మంది విద్యార్థులు, గచ్చిబౌలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 288 మంది, జెడ్పీహెచ్ఎస్ మణికొండలో 288 మంది, జెడ్పీహెచ్ఎస్ నార్సింగిలో 240 మంది, మధురానగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 192 మంది విద్యార్థులు పాలిసెట్ పరీక్ష రాయనున్నారు.



**పాలిసెట్ ప్రవేశ పరీక్ష కేంద్రాల గుర్తింపునకు ప్రత్యేక యాప్ రూపకల్పన చేశారా?**

పాలిసెట్-2025 పరీక్ష కేంద్రాలను సులభంగా విద్యార్థులు గుర్తించేలా ప్రత్యేక యాప్‌ను రూపొందించారు. ఏపీపీ-ఎస్‌బిటీఈటీ టీఎస్‌లో అందుబాటులో ఉంటుంది. దీన్ని గూగుల్ ప్లే స్టోర్‌లోకి వెళ్లి హాల్ టికెట్ నెంబర్ టైప్ చేస్తే సులభంగా గుర్తించవచ్చు.

**పాలిసెట్‌లో అర్హత సాధిస్తేనే జీఐఎల్‌టీలో సీట్లు పొందవచ్చా ?**

పాలిసెట్ ప్రవేశ పరీక్ష రాష్ట్రంలోని అన్ని పాలిటెక్నికల్ కళాశాలల్లోని కోర్సులలో సీటు పొందేందుకు అవకాశం ఉంటుంది. అందులో ఇంజినీరింగ్, జనరల్ కోర్సులు ఉంటాయి. వీటికి తోడు వ్యవసాయ విశ్వవిద్యాలయం, వెటర్నరీ విశ్వవిద్యాలయం, హార్టికల్చర్ విశ్వవిద్యాలయంలోని డిప్లొమో కోర్సులు, జీఐఎల్‌టీ లెదర్ టెక్నాలజీ కోర్సుల్లో సీటు పొందాలంటే పాలిసెట్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించడం తప్పనిసరి.


రాయదుర్గంలోని పాలిసెట్-2025 ప్రవేశ పరీక్షా కేంద్రం జీఐఎల్‌టీ ప్రధాన భవనం

**ప్రవేశ పరీక్షకు ఎలాంటి సదుపాయాలు కల్పిస్తున్నారు?**

వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి పరీక్షా కేంద్రంలో తాగునీటి సౌకర్యం కల్పించాం. దీనికితోడు ప్రత్యేక వైద్యబృందం అందుబాటులో ఉంటూ ఎలాంటి సమస్యలు వచ్చినా వారు పరిశీలిస్తారు. అట్లాగే పరీక్షా కేంద్రాలు ఉన్న రూట్లలో కూడా బస్సు ట్రిప్పుల సంఖ్య పెంచాలని డిపో అధికారులకు కూడా కోరాం.

**జీఐఎల్‌టీలో కోర్సులు పూర్తి చేస్తే ఉపాధి అవకాశాలు ఎలా ఉంటాయి?**

జీఐఎల్‌టీలో నిర్వహించే రెండు కోర్సుల్లో పూర్తి చేసిన వారు ఇప్పటి వరకు 100 శాతం ఉపాధి అవకాశాలు పొందారు. జాతీయ, అంతర్జాతీయ లెదర్ టెక్నాలజీ కంపెనీల్లో ఉద్యోగాలు పొందగా, మరికొందరు స్వయం ఉపాధి అవకాశాలు పొందుతూ తొటివారికి కూడా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379